ఇంటింటా సంక్షేమ పథకాలు

- మంత్రి మేరుగ నాగార్జున
- ఇంటూరులో గడప గడపకు మన ప్రభుత్వం


ఇంటూరులో ప్రజలు సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి మేరుగ నాగార్జున

ఇంటూరు(వేమూరు): రాష్ట్రంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. అమృతలూరు మండలంలోని ఇంటూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికి అందించిన లబ్ధిని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మూడేళ్లగా ఏటా వేల కోట్లు రూపాయలు వ్యయంతో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబంలో మహిళలకు పట్టాలు జారీ చేసి గృహ నిర్మాణాలకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర, గ్రామ సర్పంచి మొద్దు జీవన మణి, వైఎస్సార్ సీపీ నాయకులు చందోలు డేవిడ్ విజయకుమార్, వీరభద్ర శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్ సెక్రటరీ గుమ్మడి రవిరాజ్, మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ ఓలేటి శివాజీ, ఎంపీటీసీలు తమ్మ వెంకటరెడ్డి, కె.ఆనంద్ కుమారి, మాజీ సర్పంచులు బటు మోషే, కంభం శామ్యూల్, సొసైటీ అధ్యక్షులు కాజా శంకర్ రెడ్డి, యలవర్తి సురేష్, పార్టీ నాయకులు దంతు కృష్ణా రెడ్డి, భీమవరపు సాంబిరెడ్డి, దుండి రాఘవ రెడ్డి, అవుతు ముత్తారెడ్డి, ఆర్.మోహన్ రెడ్డి, కొల్లూడి అశోక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాగునీటి సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని న్యూ-వేమవరం చానల్‌పై ఉన్న రక్షిత తాగునీటి సరఫరా పథకం మోటార్ మరమ్మతులకు గురి కావడంతో సిబ్బంది సోమవారం పనులు చేపట్టారు. దీంతో భట్టిప్రోలు దళితవాడ, అద్దేపల్లి, భట్టిప్రోలు కూరగాయల మార్కెట్ ప్రాంతాల సరఫరాకు అంతరాయం కలిగినట్లు పేర్కొన్నారు. మంగళవారం నుంచి యథవిధిగా తాగునీటి సరఫరా చేస్తామని సర్పంచి దారా రవి కిరణ్మయి తెలిపారు.

16 నుంచి కల్యాణ మహోత్సవాలు

పెదపులివర్రు(భట్టిప్రోలు): బాలా త్రిపురసుందరి సమేత రాజరాజ నరేంద్రస్వామి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు పాంచాహ్నిక దీక్షతో వైభవంగా నిర్వహించనున్నట్లు దేవాలయ కార్యనిర్వాహణాధికారి మేకా సాంబశివరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ జంపని అంజయ్య సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారిని 16వ తేదీన పెండ్లి కుమారుడ్ని చేయడం, 17న స్వామి వారిని నెమలి వాహనంపై గ్రామోత్సవం, 18న స్వామి కల్యాణోత్సవం, 19న రథోత్సవం, 20న వసంతోత్సవం, 21న ధ్వజ అవరోహణ కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా స్వామి కల్యాణ మహోత్సవాలు మహా శివరాత్రి పర్వ దినాల్లో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

ఇంటి పన్ను సకాలంలో వసూలు చేయాలి

వేమూరు: ఇంటి పన్ను సకాలంలో వసూలు చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ సునీత కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి నెలలో ఇంటి పన్ను వసూలు ముమ్మరం చేయాలని చెప్పారు. వసూళ్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదే విధంగా జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం

నగరం: జాతీయ మహిళా దినోత్సవాన్ని స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పూషడపు వెంకటనారయణ మాట్లాడుతూ మహిళా సాధికారత, మహిళాభ్యుదయం వంటివి సమాజం ముందుంజకు దోహదపడతాయన్నారు. మహిళలను గౌరవించి మన సంప్రదాయాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకరాలు డాక్టర్ కనకరత్నం, తులసీజ్యోతి, ఆషా పాల్గొన్నారు.

వాటర్ షెడ్ అభివృద్ధిపై శిక్షణ

బాపట్ల: బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రంలో మంగళవారం నుంచి మూడురోజులుపాటు వాటర్‌షెడ్ అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విస్తరణ శిక్షణ కేంద్రం, భూ వనరుల శాఖ సౌజన్యంతో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తునట్లు చెప్పారు. వాటర్ షెడ్‌లో సాంకేతికతపై శిక్షణ కార్యక్రమంలో తెలియజేస్తామని తెలిపారు.

ఇద్దరు అదృశ్యం

గుంటూరు ఈస్ట్: ఇద్దరు అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. శ్యామలానగర్‌కు చెందిన బాలసైదులు భార్య వెంకటపద్మ ఈనెల 4న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో సైదులు సోమవారం పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- కొరిటెపాడుకు చెందిన వీధుల శ్రీనివాస్ గతనెల 19న ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం వెతికిన ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు సోమవారం అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కుల దూషణపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: కులం పేరుతో దూషించిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెంటచింతలకు చెందిన డేగల సైదారాజు గుంటూరు కన్నావారితోటకు చెందిన ఆలపాటి శ్రావణ్‌కుమార్‌కు రూ. 2.50 లక్షలు అప్పుగా ఇచ్చాడు. హామీ కింద చెక్కులు, నోట్లు ఇచ్చాడు. అయితే, డబ్బులు తిరిగి ఇవ్వడం లేదు. డిసెంబరు 10న సైదారాజు కన్నావారితోటలోని శ్రావణ్‌కుమార్ ఇంటికి వచ్చి డబ్బులు ఇవ్వాలని కోరాడు. ఇద్దరి మధ్యా గొడవ జరిగింది. శ్రావణ్‌కుమార్ తాను డబ్బులు ఇవ్వనని చెబుతూ, సైదారాజును కులం పేరుతో దూషించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.

సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్న ఇద్దరిపై కేసు

గుంటూరు ఈస్ట్: సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్న ఇద్దరిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శారదా కాలనీ ఆర్చి సమీపంలో కొందరు సింగిల్ నంబరు ఆట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం దాడి చేశారు. కడియం విజయకుమార్, నరసింహారావును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ. 2,900 స్వాధీనం చేసుకున్నారు.

బీసీల అభ్యున్నతికి కృషి చేయాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు

బాపట్ల: బీసీల అభ్యున్నతికి ప్రభుత్వాలు కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం బాపట్ల నియోజకవర్గం వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవులు మహేష్ ఇటీవల అనారోగ్యంగా ఉండటంతో సోమవారం పరామర్శించారు. అనంతరం కేసన మాట్లాడుతూ బీసీలు అభ్యున్నతికి పారిశ్రామిక రంగం ప్రధాన పాత్ర పోషిస్తుందని, యువత పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన రుణాలను బీసీ వర్గాల ప్రజలకు పెద్ద ఎత్తున కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఇటీవల లేఖ ద్వారా పలు అంశాలపై విన్నపాలను తెలిపానన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బాపట్ల రవికుమార్, యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ద్వారక, జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దిబోయిన తాతయ్య, జిల్లా కార్యదర్శి మారం రవికుమార్, బాపట్ల నియోజకవర్గం అధ్యక్షుడు పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్ఎస్పీ రాజు, నేతలు తురక గోపి, ఏడుకొండలు, వీరమల్లు చంద్రమౌళి, నారాయణ పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం



రేపల్లె రూరల్: అగ్నిప్రమాదంతో పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని ఉప్పుడి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారి వై.సాంబశివరావు అందించిన వివరాలు.. గ్రామంలో ఓ వ్యక్తి మృతి చెందటంతో అంతిమయాత్రలో బాణసంచా కాలుస్తుండగా గొట్టుముక్కల రాజేశ్వరి పూరింటిపై పడి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసినట్లు చెప్పారు. బాధితులకు రూ.60వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు చెప్పారు.

జాతీయ పోటీలకు ఎంపికైన మాస్టర్ అథ్లెట్స్


జాతీయ పోటీలకు ఎంపికైన మాస్టర్స్ అథ్లెట్స్‌ను అభినందిస్తున్న ముప్పలనేని

బాపట్ల: బాపట్ల మాస్టర్స్ అథ్లెటిక్స్ క్రీడాకారులు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు సోమవారం సన్మానించారు. ఈసందర్భంగా ముప్పలనేని మాట్లాడుతూ హరియాణా రాష్ట్రంలోని కురుక్షేత్రలో ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్న పోటీలకు క్రీడాకారులకు ఎంపిక కావటం హర్షణీయమని చెప్పారు. జాతీయ పోటీలకు ఎంపికైన వారిలో కె.శంకరరావు, కె.సాంబశివరావు, షేక్ నజీర్, ఎం.సురేంద్ర, షేక్ ఇమామ్, ఎస్.మురళీకృష్ణారెడ్డి, డి.సుబ్బారావు, రామస్వామి, రవికుమార్, కె.శ్రీనివాసరెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు, ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులుతో పాటు దొప్పలపూడి రామ మోహనరావు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

బాపట్ల అర్బన్: నందిరాతోటలోని గంగా పార్వతీ సమేత ఓంకార బ్రహ్మలింగేశ్వర స్వామి దేవస్థానంలో శివరాత్రి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ద్వాదశి జ్యోతులు ప్రజ్వలనతో, ద్వాదశాక్షరి మహామంత్రం, నామోచరణ, యజ్ఞం ప్రారంభించారు. భక్తులు స్వామికి ప్రత్యేక అభిషేకాలు జరిపారు. అమ్మవారికి 108 చీరలతో అలంకరణ, 108 కలిశాలతో గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. శనివారం రాత్రి 10 గంటలకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరుగుతుందని చెప్పారు. ఈనెల 18వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయని కమిటీ తెలిపింది.

స్థలాన్ని ఆక్రమించారంటూ నిరాహార దీక్ష

బాపట్ల అర్బన్: కొందరు అక్రమార్కులు తమ స్థలాన్ని ఆక్రమించి కంచె వేయడాన్ని నిరసిస్తూ స్థలం వద్ద రెండురోజుల నుంచి బాధితులు నిరాహార దీక్ష చేపట్టారు. బాపట్ల జిల్లా వైఎస్సా ర్‌సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు చల్లా రామయ్య సోమవారం నిరసన శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ 35 సంవత్సరాల క్రితం అప్పటి మాజీ స్పీకర్, ఎమ్మెల్యే కోన ప్రభాకరరావు ఇందిరా నగర్ ప్రజలకు ఒక్కొక్కరికి ఐదు సెంట్లు చొప్పున ఇళ్ల పట్టాలు ఇవ్వటం జరిగిందన్నారు. చెరువు కోసం 15 సెంట్ల స్థలాన్ని ఇచ్చారని, అనంతర కాలంలో చెరువు గుంతను అంగన్‌వాడీ పిల్లల పాఠశాల కోసమని ప్రజలు అధికారులను సంప్రదించి ఆ గుంతను పూడ్చడం జరిగిందన్నారు. ఈ స్థలాన్ని కొంతమంది ఆక్రమించి స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేశారని పేర్కొన్నారు. ఈసమస్యను ఎమ్మెల్యే కోన రఘుపతి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. దీక్షలో కుప్పాల నరసింహ, తాడిశెట్టి సాంబయ్య, దుప్పల రాఘవ, తాడిశెట్టి శివకుమారి, మల్లెల రాధిక, రేగులగడ్డ మరియమ్మ, మాజీ వార్డు కౌన్సిలర్ పసుమర్తి యలమంద, వైఎస్సార్ సీపీ నాయకులు పేర్లి చిన్నా, కాగిత రవి పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ల అప్పగింత

నగరంపాలెం: మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న మరో ఇద్దరు బాధితులకు గుంటూరు జిల్లా పోలీసులు వాటిని అప్పగించారు. గతనెల 28న గుంటూరు జిల్లా పోలీసులు మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల సౌకర్యార్థం వాట్సాప్ నంబర్ 86888 31574ను అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం విదితమే.. ఈ క్రమంలో వాట్సాప్ నంబర్‌కు గుంటూరు నగర వాసులైన ఎం.హరీష్, ఎం.మహేష్‌బాబు 'హాయ్' అని మేసేజ్ పంపించారు. దీంతో లింక్‌తో కూడిన మేసేజ్‌లు వారికి రావడంతో ఓపెన్‌చేసి వివరాలు తెలిపి, అప్లికేషన్ సబ్మిట్ చేశారు. అనంతరం మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి పోలీసులు గుర్తించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని స్పందన హాలులో ఏఎస్పీ (క్రైం) శ్రీనివాసరావు, ఐటీ కోర్ ఇన్‌చార్జి ఎస్ఐ వెంకటకృష్ణ బాధితులకు మొబైల్ ఫోన్లను అప్పగించారు. ఈ సందర్భంగా ఇద్దరూ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

సాధికారతతోనే మహిళల సమస్యలకు పరిష్కారం

వీసీ రాజశేఖర్


సమావేశంలో ప్రసంగిస్తున్న రాజశేఖర్

ఏఎన్‌యూ: మహిళల పరిపూర్ణ సాధికారతే వారు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు పరిష్కారమని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ తెలిపారు. నాగార్జున యూనివర్సిటీ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో 'వైలెన్స్ యాస్ ఇంప్లిమెంట్ టూ ఉమెన్ ఎంపవర్‌మెంట్' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సును సోమవారం వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న హింసలపై పలు ఉద్యమాలు జరుగుతున్నా, మహిళా సాధికారతపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రిజిస్ట్రార్ బి. కరుణ మాట్లాడుతూ మహిళలపై నేటికీ హింసలు పలు రూపాల్లో ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రెక్టార్ పి. వరప్రసాదమూర్తి ప్రసంగిస్తూ మహిళలపై జరుగుతున్న హింస నియంత్రణ, సాధికారత పెంపునకు పరిష్కార మార్గాలు చూపడానికి ఈ సదస్సు దోహదం చేస్తుందని తెలిపారు. ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సర్వీస్ డీన్ చైతన్య కుమారి ప్రసంగిస్తూ మహిళలపై హింసకు ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని తెలిపారు. హైదరాబాద్ జాతీయ మహిళా అధ్యయన కేంద్రం అధ్యాపకులు షీలా నారాయణ్ ప్రసంగిస్తూ ప్రతి ఏడాది ఎంతో మంది మహిళలకు పలు రకాల హింసలకు గురవుతున్నారన్నారు. మహిళలు విద్యావంతుల వ్వడం ద్వారానే అవరోధాల్ని అధిగమించవచ్చని సూచించారు. ఏపీ హైకోర్టు న్యాయవాది నీరు మిశ్రా, విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ప్రభాకర్ ఆకురాతి ప్రసంగించారు. డైరెక్టర్ డాక్టర్ కె.వి.శాంతిశ్రీ సదస్సులో చర్చిస్తున్న అంశాల్ని వివరించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

16న వాహనాల వేలం

తెనాలి రూరల్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న ఐదు మోటారు సైకిళ్లకు ఈ నెల 16న వేలం వేయనున్నట్లు ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏ.వి. చలం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు అధికారులు నిర్ణయించిన మొత్తంలో 10 శాతం డీడీ రూపంలో చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని సూచించారు. వివరాలకు 9440902474 నంబరులో సంప్రదించాలని కోరారు.

దర్గాలో భక్తిశ్రద్ధలతో చంద్రమాన ప్రార్థనలు


దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న పీఠాధిపతులు

లక్ష్మీపురం: నల్లచెరువు ఎత్తురోడ్డు సెంటర్‌లోని హజ్రత్ మొహీయుద్దీన్ పాలెంలోని మహబూబ్ సుభాని 17వ మనువలు హజ్రత్ సయ్యద్ షా మొహీయుద్దీన్ బాద్‌షా ఖాదిరి దర్గా ప్రాంగణంలో చంద్రమాన 21వ రోజు, స్వర్గీయ హజ్రత్ నూరుల్ ముస్తఫా ఖాదిరి జన్మదిన వేడుకల్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా దర్గా ప్రాంగణంలోని బాబా సమాధిని పూలతో అలంకరించి, ధూప, దీపాలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సయ్యద్ షా సులేమాన్ అల్ హసనీ ఉల్ హుస్సైనీ ఖాదిరి మాట్లాడుతూ నెలలో ప్రతి గురువారం, ప్రతి నెల చంద్రమాన 21వ రోజు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని చెప్పారు. వచ్చే నెల 13వ తేదీ నుంచి దర్గాలో ఉరుసు మహోత్సవ వేడుకల్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉరుసు మహోత్సవంలో మొక్కులను తీర్చుకునేందుకు భక్తులు ముందుగానే దర్గా పీఠాధిపతులకు సమాచారం అందించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో బాబా మురీదులు, స్థానికులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

బుర్రకథ కళాకారుడు సాంబశివరావుకు సన్మానం



తెనాలి అర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం అగ్గి బరాటా చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మంగళవారం సత్యహరిశ్చంద్ర చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ బుర్రకథ కళాకారుడు బొల్లిముంత సాంబశివరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ సినీ నటి రాజశ్రీ, మాటల రచయిత బుర్రా సాయిమాధవ్, కౌన్సిలర్లు అడుసుమల్లి వెంకటేశ్వరారావు, దివి అనిత, ఉత్సవ కమిటీ సభ్యులు టి.ఎన్.ఎస్. శ్రీనివాస్, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు తాడిబోయిన హరిప్రసాద్, మాదల కోటేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, గుమ్మడి ప్రసాద్, దేవిశెట్టి భాస్కర్ పాల్గొన్నారు.

త్వరితగతిన గృహ నిర్మాణాలు చేపట్టాలి

–హౌసింగ్ డీఈ అత్తోట రవి కుమార్


లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ అత్తోట రవి కుమార్, పక్కన వివిధ శాఖల సిబ్బంది

భట్టిప్రోలు: జగనన్న కాలనీ లబ్ధిదారులు త్వరితగతిన గృహ నిర్మాణాలు చేపట్టాలని హౌసింగ్ డీఈ అత్తోట రవి కుమార్ పేర్కొన్నారు. స్థానిక జగనన్న కాలనీల్లోని లే-అవుట్లలో గృహ నిర్మాణాల లబ్ధిదారుల సమావేశం సోమవారం నిర్వహించారు. రవి కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం గృహ నిర్మాణాలు చేపట్టేందుకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు గూడు ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారని పేర్కొన్నారు. లబ్ధిదారులకు మండల సమాఖ్య తరఫున రూ.35 వేలు ఆర్థిక సహాయం అందచేస్తుందని వివరించారు. వెంటనే బేస్‌మెంట్ పూర్తి చేస్తే, ఆ వెంటనే గృహ నిర్మాణానికి అవసరమైన ఐరన్, సిమెంట్, ఇసుక పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లే-అవుట్లలో ఈపాటికే విద్యుత్ సౌకర్యం కల్పించబడిందని త్వరలో పైప్‌లైన్ నిర్మాణం పూర్తి చేసి నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు దారా చెన్నయ్య, హౌసింగ్ ఏఈ రావూరి సౌమ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకృష్ణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సాగర్, శిరీష, సీసీ హనూక్, హౌసింగ్ సిబ్బంది బాలకృష్ణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు..

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- పేరలిలో గడప గడపకు మన ప్రభుత్వం


పేరలి గ్రామంలో ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: గ్రామాల్లో ఉన్న సమస్యలు పరిష్కరించి అర్హులైన వారికి సంక్షేమ పథకాలను అందించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సంక్షేమ పథకాలను వివరించి బ్రోచర్ అందజేశారు. తొలుత గ్రామంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాజకీయాలకు, కుల మతాలకతీతంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందని చెప్పారు. పేరలి గ్రామంలో కోట్లాది రూపాయలతో తాగునీటి సరఫరాకు పైప్‌లైన్ నిర్మాణం, సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ నిర్మాణం పనులు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి మల్లెల వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు దొంతిబోయిన సీతారామిరెడ్డి, ఎంపీపీ యారం వనజ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పందరబోయిన సుబ్బారావు, కాగిత బుల్లియ్య, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గొర్రుముచ్చు మీరయ్య, సొసైటీ చైర్మన్ మరకా పెదవెంకటేశ్వర్లు, ఎస్ఎంసీ చైర్మన్ సలగల ధర్మేంద్ర పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో అవకతవకలు ఉంటే సీజ్ చేస్తాం

సివిల్ సప్లయిస్ జిల్లా అధికారి విలియమ్స్


పెట్రోల్ బంక్‌లో తనిఖీలు చేస్తున్న జిల్లా సివిల్ సప్లై అధికారి విలియమ్స్

బాపట్ల టౌన్: పెట్రోల్ బంక్‌లో అవకతవకలకు పాల్పడితే బంక్‌లు సీజ్ చేస్తామని సివిల్ సప్లయిస్ జిల్లా అధికారి విలియమ్స్ హెచ్చరించారు. సోమవారం జిల్లాలోని పలు పెట్రోల్ బంక్‌లను తనిఖీ చేశారు. సివిల్ సప్లయిస్ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, పెట్రోల్ బంక్‌ల్లో జరుగుతున్న అక్రమాలను అరికట్టేందుకు సివిల్‌సప్లయిస్ జిల్లా అధికారి, తహసీల్దార్, సీఎస్‌డీటీ, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్లు, ఆయిల్ కంపెనీల సేల్స్ ఆఫీసర్లను కమిటీలుగా ఏర్పాటు చేశారు. డీఎస్ఓ విలియమ్స్ మాట్లాడుతూ జిల్లాలో 105 పెట్రోల్ బంక్‌లు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్రోల్ బంక్‌ల్లో జరిగే అవకతవకలను నివారించేందుకు నూతనంగా ఏపీ పెట్రోల్ బంక్ ఇన్‌స్పెక్షన్ యాప్‌ను రూపొందించారన్నారు. బంక్‌ల్లో జరిగే అక్రమాలకు ఈ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నామని చెప్పారు. పెట్రోల్ బంక్‌ల్లో ముఖ్యంగా తాగునీరు, మరుగుదొడ్లు, గాలి మిషన్లు, సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

ఫైన్ ఆర్ట్స్ అధ్యాపకుడికి 'కళారత్న' పురస్కారం


జాన్ రత్నబాబును సన్మానిస్తున్న వీసీ

ఏఎన్‌యూ: నాగార్జున యూనివర్సిటీ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుడు జాన్ రత్నబాబుకు 'కళారత్న' పురస్కారం లభించింది. ఆయన్ను సోమవారం యూనివర్సిటీలో వీసీ ఆచార్య పి. రాజశేఖర్ సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌కి చెందిన కళారత్నం ఫౌండేషన్ ఆఫ్ ఆర్ట్ సొసైటీ గత ఏడాది డిసెంబరు 10, 11 తేదీల్లో వార్షిక ఆర్ట్ కాంటెస్ట్ నిర్వహించిందని తెలిపారు. ఇందులో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల నుంచి ఐదువేల మంది కళాకారులు పలు విభాగాల్లో చిత్రాల్ని పోటీలకు పంపగా తాను పంపిన చిత్రం ఎంపికైందని వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి. కరుణ, ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఈ. శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు నిరుపమ, ఫైన్ ఆర్ట్స్ విభాగ కో-ఆర్డినేటర్ శేఖర్‌బాబు, అధ్యాపకుడు దేవకాంత్ పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో విద్యార్థులకు పతకాలు



తెనాలి: గుంటూరులోని గవర్నమెంట్ కాలేజీ ఫర్ విమెన్ ఆధ్వర్యంలో జరిగిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల పవర్ లిఫ్టింగ్ టీం చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీకి చెందిన లిఫ్టర్లు ప్రతిభను ప్రదర్శించి బంగారు పతకాలను సాధించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ చెప్పారు. కాలేజీ విద్యార్థిని ముక్కడాల అనూష (52 కిలోల విభాగం) షేక్ రషీద్ (83 కిలోలు), పాలేరు భార్గవ్ రామ్ తమ విభాగాల్లో బంగారు పతకాలను కైవసం చేసుకున్నట్టు తెలిపారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని నాగార్జున యూనివర్సిటీ పీజీ క్యాంపస్‌లో చదువుతూ తమ కాలేజీలో శిక్షణ పొందుతున్న ముక్కామల సంయుక్త 84 ప్లస్ కేటగిరీలో బంగారు పతకం సాధించినట్టు తెలిపారు. హిమాచలప్రదేశ్‌లో మార్చిలో జరగనున్న అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల పవర్ లిఫ్టింగ్ (మహిళలు) చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జట్టుకు ముక్కడాల అనూష , ముక్కామల సంయుక్త ఎంపికైనట్టు వ్యాయామ అధ్యాపకుడు నల్లక శేషగిరిరావు వెల్లడించారు. పతకాలు సాధించిన లిఫ్టర్లను ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అభినందించారు.